ఇఫ్తార్ విందు చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని 6 మసీదులకు రంజాన్ సందర్భంగా ప్రభుత్వం తరపు నుంచి ఇఫ్తార్ విందు ఏర్పాటుకు విడుదల చేసిన చెక్కులను మల్లాపూర్ వార్డు కార్యాలయంలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పంపిణీ చేశారు. ఎండీ బాసిత్‌ఖాన్, ఎండీ అల్తాఫ్, ఎండీ మున్నీర్, అక్బర్, ఉస్మాన్, జాకీర్‌అలీ, నయీమ్, హబీబ్‌ఖాన్, హుస్సేన్, ఖాసీం, ఉమర్ తదితరులున్నారు.

బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు

అల్వాల్: టెంపుల్ అల్వాల్‌లోని బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయం హుండీని బుధవారం దేవాదాయ శాఖ పర్యవేక్షణాధికారి కె.మోహన్‌రెడ్డి సమక్షంలో లెక్కించారు. ఈ సందర్భంగా రూ.1,25,617 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజాసంజయ్ సైంచర్, కార్య నిర్వహణాధికారి వీరేశం, స్థానిక నాయకులు సురేందర్‌రెడ్డి, భక్తులు రాంచందర్‌రావు, శివరామకృష్ణ, నాగేష్, శ్రీవాణి, చంద్రమణి, నిర్మలారెడ్డి, కవిత, రోజా, హేమవతి, రవిచంద్ర, యశ్వంత్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీక అని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సాయి జెన్‌శేఖర్ అన్నారు. బుధవారం సాయంత్రం నాచారం రాఘవేంద్రనగర్‌లోని మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయి జెన్‌శేఖర్ మాట్లాడుతూ రంజాన్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలి

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మిర్జాలగూడలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను తొలగించి రోడ్డు నిర్మాణం చేయాలని మిర్జాలగూడ సంక్షేమ సంఘం సభ్యులు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ.. కాలనీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను తొలగించి రోడ్డు నిర్మాణం చేయాలని, స్థానిక ప్రజాప్రతినిధులు వారికి అమ్ముడుపోయి అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఇటీవల హైడ్రా అధికారులు తమ ప్రాంతాన్ని సందర్శించి ఆక్రమణలకు మార్కింగ్ చేశారని, కానీ వాటిని పట్టించుకోకుండా నిర్మాణాలు కొనసాగిస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తక్షణమే డివిజన్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మిర్జాలగూడ సంక్షేమ సంఘం అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి శోభారాణి, విజయ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ శ్రీరామ్‌యాదవ్, కార్యవర్గసభ్యులు శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

చెత్త కుప్పను తొలగించేశారు !

కుషాయిగూడ: గత శనివారం కుషాయిగూడ పారిశ్రామికవాడలో పేలుడు ఘటన చోటు చేసుకున్న చెత్త కుప్ప తొలగింపు ఆపరేషన్ పూర్తైంది. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరిస్తున్న సమయంలో రెండోసారి పేలుడు సంభవించడంతో అంతా అప్రమత్తమయ్యారు. ప్రమాదకరమైన రసాయనిక వ్యర్థాలతో నిండిన చెత్తకుప్పతో ప్రమాదం పొంచి ఉందని భావించిన పోలీసులు చెత్తకుప్పను నిర్వీర్యం చేయాలని నిర్ణయించారు. అన్ని శాఖల అధికారులతో మాట్లాడి సమన్వయం చేసి రెండ్రోజుల పాటు శ్రమించి చెత్తకుప్పను నిర్వీర్యం చేశారు. కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ కొనసాగింది. ప్రమాదకరమైన పేలుడు రసాయనాలను ఇష్టారాజ్యంగా డంప్ చేయడం సరికాదని, అలాంటి వాటి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఇన్‌స్పెక్టర్ స్పష్టం చేశారు. ఈ ఘటనపై విచారణ కొనసాగుతుందని తెలిపారు.

తండ్రిని చంపిన కుమారుడి అరెస్ట్

కుషాయిగూడ: మద్యం మత్తులో తండ్రి గొంతునులిమి హత్య చేసిన ఘటనలో నిందితుడిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో పత్లావత్ శంకర్‌ను కుమారుడు జగదీష్ గొంతు నులిమి హత్య చేసిన విషయం తెలిసిందే. పరారీలో ఉన్న నిందితుడిని నేరెడ్‌మెట్, కాకతీయనగర్ నగర్‌లోని అతడి బావ ఇంట్లో బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

రహదారి పూర్తయ్యేదెన్నడో ?

ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారిపై నిత్యం అవస్థలు పడుతున్న జనం

ఉప్పల్: ఉప్పల్ టు నారాపల్లి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడి ప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమై ఏడేళ్లు గడుస్తున్నా.. 'ఎక్కడేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా మారింది.

ఎటూ తేలని పరిస్థితి..

అటు కారిడార్ పనులు పూర్తి కావడం లేదు. ఇటు రోడ్డు పనులు పూర్తి చేయడం లేదు. దీంతో నిత్యం వేలాది మంది ప్రజలు, ప్రయాణికులు నిత్యం నరక యాతన అనుభవిస్తున్నారు. ఉప్పల్ నుంచి నారాపల్లి సీపీఆర్‌ఐ వరకు దాదాపుగా 7 కిలోమీటర్ల వరకు వాహనదారులకు పట్టపగలే చుక్కలు కనబడుతున్నాయి.

కంకర తేలిన రోడ్లు..

ఓ పక్క కంకర తేలిన రోడ్లు మరో పక్క మట్టి దిబ్బలు ఇలా దాదాపుగా 7 కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా రోడ్డంతా కంకర తేలి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే బురద, ఎండకాస్తే దుమ్ము, ధూళితో అవస్థలు ఎదుర్కొంటున్నారు. దీనిపై పలుమార్లు మంత్రులకు ఫిర్యాదులు చేయడంతో ఈ మధ్యకాలంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రోడ్డు పరిస్థితిని చూసి వెళ్లారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యటించి హామీలు ఇస్తున్నారని, వాటిని నెరవేర్చడం లేదని స్థానికులు వాపోతున్నారు.

హైదరాబాద్ భూపాలపట్నం 163వ జాతీయ రహదారి, హైదరాబాద్, వరంగల్ మధ్య వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని 150 మీటర్ల సర్వీస్ రోడ్డును నిర్మిస్తూ.. యాదాద్రి వైపు వెళ్లే వాహనాలకు నిరాటంకంగా ప్రయాణానికి వీలు కల్పించేలా అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

ఆందోళన చేసినా ఫలితం లేదు..

ఎలివేటెడ్ కారిడార్ పనుల జాప్యంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తైనా ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. కాగా కారిడార్ నిర్మాణం అటుంచి కింది రోడ్డునైనా బాగు చేయమని, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.



అసంపూర్తి పనులతో ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారి

కారిడార్ పూర్తి చేయాలని సీపీఎం పాదయాత్ర..

అసంపూర్తిగా ఉన్న ఎలివవేటెడ్ కారిడార్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ.. ఈనెల 22న సీపీఎం ఆధ్వర్యంలో నారాపల్లి నుంచి ఉప్పల్ చౌరస్తా వరకు పాదయాత్ర నిర్వహించిన సంగతి విధితమే.

తాజా నిర్ణయాలు...

కారిడార్ పనుల్లో జాప్యానికి రాష్ట్ర ప్రభుత్వం, నిర్మాణ సంస్థల తీరు కారణమని కేంద్ర ఉపరితల రవాణాశాఖ తేల్చినట్లు సమాచారం. సకాలంలో భూసేకరణ చేయకపోవడం, నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకపోవడం, భూసేకరణ సకాలంలో పూర్తిచేయలేకపోవడం లాంటి అనేక అంశాలతో జాప్యం జరిగిందని తేల్చింది.

జాప్యానికి రూ.14 కోట్ల జరిమానా..

పనుల జాప్యానికి నిర్మాణ సంస్థకు రూ.14 కోట్ల వరకు జరిమానా విధించినట్లు సమాచారం. మొత్తం రూ. 670 కోట్లలో ఇప్పటి వరకు కేవలం రూ.425 కోట్ల వరకు మాత్రమే పనులు చేసినట్లు తెలిసింది. ఇంకా రూ. 225 కోట్లకు పైగా పనులు చేయాల్సి ఉండగా.. ప్రాజెక్టు పూర్తికావడానికి అదనంగా మరో రూ.60 కోట్లు కావచ్చని అంచనాకు వచ్చినట్లు తెలిసింది.

4 లైన్ల తారు రోడ్డు వేయాలి..



కారిడార్ పూర్తవ్వడానికి కనీసం ఇంకా రెండేళ్లకు పైగా సమయం పడుతుంది. అప్పటి దాకా ఇక్కడి ప్రజలు ఇలా ఇబ్బందులు పడాలా..? వెంటనే అధికారులు కనీసం రోడ్డుకు ఇరువైపుల 4 లైన్ల తారు రోడ్డు వేయాలి. అది కూడా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి.

– వెంకన్న, ఉప్పల్ సర్కిల్ సీపీఎం కార్యదర్శి

సరైన రోడ్డు లేక ఇబ్బంది



పాదయాత్రలో కనీసం నడవలేని పరిస్థితి ఎదురైంది. సరైన రోడ్డు లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని గమనించాం. కారిడార్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి. అప్పటి వరకు నారాపల్లి నుంచి ఉప్పల్ చౌరస్తా వరకు బీటీ రోడ్డు వేయాలి. నిర్లక్ష్యం చేస్తే ఆందోళనకు సిద్ధమవుతాం.

– కొమటి రవి, సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

పార్కులో కనీస సౌకర్యాలు కల్పించండి



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ సభ్యులు

సాక్షి, సిటీబ్యూరో: సైనిక్‌పురిలో ఉన్న జీహెచ్‌ఎంసీ పార్కు (సెక్టార్-ఈ)లో తాగునీటి సౌకర్యం, శౌచాలయం ఏర్పాటు చేయాలని సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. పార్కులో సాయంత్రం పూట నడక సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తగిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. సభ్యులు డా. రమేష్, సేహినాజ్ సుల్తానా, సీహెచ్.రామారావు, సుధాకర్, ఎం.మురళీకృష్ణ, రాజేందర్, శ్రీనివాస్‌రాజు, జానకిరాం, శ్రీశైలం తదితరులున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

అల్వాల్: డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని మచ్చబొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. బుధవారం ఆయన లప్పం ఫ్యాక్టరీ సమీపంలోని సాయిసూర్య కాలనీలో రూ.38 లక్షల చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి కాలనీ అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సురేందర్‌రెడ్డి, ఏ-బ్లాక్ అధ్యక్షులు అశోక్‌రెడ్డి, శ్రీశైలం యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, లడ్డు, రాజేందర్, నర్సింగ్, నవీన్, వెంకటేష్‌గౌడ్, సంతోష్‌రెడ్డి, దేవా, సహదేవ్, కొండల్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, అక్రమ్, ఇస్సాక్, కాలనీవాసులు నర్సింగ్‌రావు, సురేందర్ రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయభాస్కర్, వినయ్‌రెడ్డి, రాజీరెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్

మల్కాజిగిరి అభివృద్ధికి 'మర్రి' కృషి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేత వెంకన్న

మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, నాయకులు అన్నారు. బుధవారం మల్కాజిగిరి సర్కిల్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు వెంకన్న ఆధ్వర్యంలో బృందావన్ గార్డెన్స్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సునీతాయాదవ్, నాయకులు జగదీష్‌గౌడ్, మురుగేష్, పరశురామిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రావుల అంజయ్య, వెంకన్న మాట్లాడుతూ.. ఏడాదిలోనే నియోజకవర్గ అభివృద్ధిలో ఎమ్మెల్యే చెరగని ముద్ర వేశారన్నారు. అసెంబ్లీలో నియోజకవర్గానికి సంబంధించినవే కాకుండా రాష్ట్రంలోని సమస్యలను కూడా ప్రస్తావించారన్నారు. ఆర్‌యూబీల నిర్మాణం కోసం పలుమార్లు రైల్వే అధికారులతో సమావేశం నిర్వహించారన్నారు. అధికార పక్ష నేతలు అడ్డంకులు సృష్టిస్తున్నా ఆయన వెనుకడుగు వేయడం లేదన్నారు. సమావేశంలో చిన్నాయాదవ్, భాగ్యానంద్, నవీన్‌యాదవ్, సాయిగౌడ్, ఉస్మాన్, బాబూరావు, కాటం రాజు, శ్రీనివాసరెడ్డి, గడ్డమీది రాజు, శేఖర్‌గౌడ్, బాలక్రిష్ణ, గుత్తి చందు, సూరి, వంశీ ముదిరాజ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కలతో ఆరోగ్య సంరక్షణ



మొక్కల పరిశోధన సంస్థ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో విద్యార్థులు

బోడుప్పల్: ఔషధ, సుగంధ మొక్కలతో ఆరోగ్య సంరక్షణ పొందవచ్చని శాస్త్రవేత్త, ఇన్‌చార్జి కిరణ్‌బాబు అన్నారు. బుధవారం బోడుప్పల్‌లోని కేంద్రియ ఔషధ, సుగంధ మొక్కల పరిశోధన సంస్థ 66వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రైతులు, ఫార్మసీ విద్యార్థులకు విజ్ఞాన సందర్శన, ఔషధ, సుగంధ మొక్కల పెంపకం, ప్రాసెసింగ్, నాణ్యత ప్రమాణాలు, మార్కెటింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య సంరక్షణలో ఔషధ, సుగంధ మొక్కల ఉపయోగాలు, పరిశోధన, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు.

వృద్ధురాలి అదృశ్యం



లక్ష్మమ్మ

అల్వాల్: ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన నెరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక్ నగర్‌కు చెందిన బాలనర్సింహ తల్లి బరుగు లక్ష్మమ్మ (82) మతిస్థిమితం బాగాలేదు. ఈనెల 24న వారి ఇంటి గేటు తీసి ఉండగా.. ఇంట్లో లక్ష్మమ్మ కనిపించలేదు. ఆచూకీ కోసం పలుచోట్ల వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోరాట యోధుడు ధర్మభిక్షం

కాప్రా: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు, గొప్ప కమ్యూనిస్టు నాయకుడు బొమ్మగాని ధర్మభిక్షం అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీఎస్ బోస్ అన్నారు. బుధవారం ధర్మభిక్షం 14వ వర్ధంతి సందర్భంగా ఈసీఐఎల్ నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీఎస్ బోస్ మాట్లాడుతూ.. 'దున్నేవాడిదే భూమి, గీసే వాడికే చెట్టు' అనే నినాదంతో గీత కార్మికుల సంక్షేమానికి కృషి చేసిన మహనీయుడు ధర్మభిక్షం అన్నారు. తన చివరి శ్వాసవరకు పేదల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు దామోదర్‌రెడ్డి, శంకర్ రావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బొమ్మగాని ధర్మభిక్షం చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

వైభవంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: మీర్‌పేట్, హెచ్‌బీకాలనీ డివిజన్, కృష్ణానగర్ కాలనీలోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ సిబ్బంది వారిని ఘనంగా సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి, బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, గుమ్మడి జంపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, చారి, బాలరాజు, నగేష్, మురళీచారి, రమేష్, నరేందర్ తదితరులున్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి



ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ చాణుక్యపురి కాలనీలో ప్రభుత్వ స్థలాలను పరిరక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన అధికారులతో కలిసి కాలనీలో ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ పలు ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు, పార్కులు కబ్జాకు గురయ్యాయని వాటి సంరక్షణకు చర్యలు తీసుకుని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ విభాగం ఏసీపీ శ్రీనివాసరావు,ఎస్‌వో సంగీత, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కాప్రా: జమాతే ఇస్లామీ ఆధ్వర్యంలో కాప్రా, ఏఎస్‌రావునగర్ డివిజన్ల పరిధిలోని నిరుపేద ముస్లింలకు రంజాన్ పండగ సందర్భంగా బుధవారం నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాప్రా ఈద్గా అధ్యక్షుడు బద్రుద్దీన్ మాట్లాడుతూ..క్రమశిక్షణ, ధాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ సందేశమని తెలిపారు. ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ మాసంలో సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ హమీద్, ఖాజా పట్వారీ, ఎండీ గౌస్, సలీం, మిక్బుల్ తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ కానుకలు పంపిణీ చేస్తున్న దృశ్యం

క్రైస్తవులపై దాడులకు పాల్పడిన వారిని శిక్షించాలి



మల్కాజిగిరిలో నిరసన చేస్తున్న పాస్టర్లు

మల్కాజిగిరి: క్రైస్తవులపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని యూఐసీజేఏసీ (అఖిలభారత క్రిస్టియన్ సమాఖ్య) నాయకుడు బక్కోలు సంజయ్‌ఆనంద్ డిమాండ్ చేశారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై ఏపీ పోలీసుల తీరును నిరసనగా మల్కాజిగిరి చౌరస్తాలో ధర్నా చేశారు. ఇటీవల క్రిస్టియన్లను కించపరిచేలా మాట్లాడటం, దాడులు చేయడం పెరిగిపోయాయన్నారు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు. జాకబ్ పాస్టర్, భూషణం, నాగేష్, మోనా, సునీల్, సదానందం, ఎల్లాద్ పాస్టర్ తదితరులున్నారు.

రామంతాపూర్‌లో విషాదచాయలు

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

రామంతాపూర్ : నెహ్రూనగర్ కాలనీకి చెందిన పాండు సక్కుబాయి దంపతులు మంగళవారం రంగారెడ్డి జిల్లా కొత్తూరు మున్సిపల్ పరిధి తిమ్మాపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన తెలిసిందే. వారి మరణ వార్త తెలియగానే రామంతాపూర్ నెహ్రూనగర్‌లో విషాద చాయలు అలుముకున్నాయి. అందరితో కలివిడిగా కలిసిమెలిసి ఉండే వారని స్థానికులు కన్నీరు పెట్టుకున్నారు. సక్కుబాయి మహేశ్వరం మండలంలో పంచాయితీ కార్యదర్శిగా, పాండు నగరంలోని అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం సక్కుబాయి తన పుట్టింటికి (కొందుర్గు)వెళ్లి తిరిగి వస్తుండగా తిమ్మాపూర్‌లో ఇసుక లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి లారీని ఢీకొట్టడంతో లారీ స్కూటీపైకి దూసుకెళ్లింది. స్కూటీపై ఉన్న దంపతుల్లో సక్కుబాయి అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన పాండును హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందినట్లు సమాచారం. వారికి నలుగురు సంతానం. కాగా వారిలో ఇద్దరు కుమార్తెలు, కుమారులు. స్థానిక నెహ్రూనగర్‌కు చెందిన పలువురు తిమ్మాపూర్‌లోని కొందుర్గు గ్రామంలో పాండు దంపతుల అంతిమ యాత్రను పాల్గొనడానికి బుధవారం వెళ్లారు.

శ్మశానవాటిక స్థలం పరిశీలన

అల్వాల్: మచ్చబొల్లారంలో వివాదాస్పదంగా మారిన హిందూ శ్మశానవాటిక స్థలాన్ని బుధవారం హైడ్రా అధికారులు పరిశీలించారు. శ్మశానవాటికకు కేటాయించిన స్థలం ఎంత వాటిలో ఏర్పాటైన నిర్మాణాలపై ఆరా తీశారు. ప్రస్తుతం డంపింగ్ చేస్తున్న ప్రాంతంలో పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మంగళవారం డంపింగ్ యార్డుపై కాలనీవాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారులు స్థలాన్ని సందర్శించారు. అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాలనీల జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. శ్మశానవాటిక కోసం ఇచ్చిన స్థలంలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో పాటు షెడ్లు ఏర్పాటు చేసి వాణిజ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు సర్వేచేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని సూచించారు. హైడ్రా తహసీల్దార్ హేమమాలిని, హైడ్రా ఇన్‌స్పెక్టర్ ఆదిత్యగౌడ్, 30 కాలనీల జేఏసీ నాయకులు సుధాకర్ పడాల, ఉదయ్‌ప్రకాష్, కవిత, అల్వాల్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జోలి రమేష్, అనిల్‌కిషోర్‌గౌడ్, పరమేష్, పవన్, చరణ్, గిరి నాయకులు పాల్గొన్నారు.



హైడ్రా అధికారులతో అల్వాల్ డీసీ శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ శాంతి

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి

ఉప్పల్: విద్యార్థులు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సమర్థత వంటి విలువలను మెరుగు పరుచుకోవాలని మాజీ ఐపీఎస్ అధికారి అరుణా ఎం బహుగుణ సూచించారు. ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవ, నివేదిక కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలని సూచించారు. కళాశాల ఆవరణలో విద్యార్థులచే నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ అధ్యాపకులు, ఉత్తమ విభాగాలకు పురస్కారాలను అందజేశారు. కళాశాల డైరెక్టర్ బ్రదర్ జాన్, కరస్పాండెంట్ బ్రదర్ అరుణ్, ప్రిన్సిపాల్ జయంతిరెడ్డి తదితరులున్నారు.